
సాక్షి అనకాపల్లి

ఆదివారం । 8 । డిసెంబర్ । 2024

ప్రకృతి అందాలకు పరవశం



ప్రముఖ పర్యాటక కేంద్రం వంజంగిలో ప్రకృతి అందాలకు పర్యాటకులు పరవశించిపోయారు. తుపాను కారణంగా కొద్దిరోజులుగా మంచు కురువడం లేదు. దీని ప్రభావం తగ్గడంతో శనివారం తెల్లవారుజామున వంజంగి హిల్స్‌లో మేఘ సౌందర్యం కనువిందు చేసింది. భారీగా తరలివచ్చిన పర్యాటకులు ప్రకృతి దృశ్యాలను తిలకించారు. – సాక్షి, పాడేరు

న్యూస్‌రీల్

మధ్యవర్తిత్వం.. సత్వర పరిష్కారం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్

విశాఖ లీగల్: ఇరువర్గాల మధ్య మధ్యవర్తిత్వం ద్వారా కేసులు పరిష్కరించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ పిలుపునిచ్చారు. జిల్లా కోర్టులోని న్యాయవాదులకు మధ్యవర్తిత్వ విధానంపై శనివారం జరిగిన సదస్సులో ఆయన ప్రసంగించారు. విదేశాల్లో 90 శాతం కేసులు మధ్యవర్తిత్వం ద్వారా రాజీ అవుతున్నట్లు చెప్పారు. ఈ పద్ధతిని మన దేశంలో కూడా ఉపయోగించుకుంటే పెండింగ్ కేసుల సంఖ్య భారీగా తగ్గుతుందన్నారు. 2013లో అమల్లోకి వచ్చిన కుటుంబ న్యాయస్థానం చట్టంతో మధ్యవర్తిత్వం ద్వారా పలు వివాదాలు పరిష్కరించుకోవచ్చని వెల్లడించారు. ఇందుకు సంబంధించి పలు కేసులను ఉదహరించారు. పని ప్రదేశంలో మహిళలు లైంగిక వేధింపులకు గురికాకుండా.. మహిళల రక్షణ చట్టం–2013లోని వివిధ అంశాలను విపులంగా వివరించారు. కుటుంబ న్యాయస్థానం న్యాయమూర్తి రాధారత్నం మాట్లాడుతూ కుటుంబ వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్వం మాత్రమే శిరోధార్యమన్నారు. న్యాయవాదులందరూ మధ్యవర్తిత్వ విధానంలో మెలకువలు తెలుసుకుని.. రాజీ చేసుకోవాలని సూచించారు. మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.వెంకటరమణ మాట్లాడుతూ మధ్యవర్తిత్వ ప్రక్రియ ద్వారా కేసులు రాజీ చేసుకుంటే.. న్యాయస్థానాలకు పని భారం తగ్గుతుందన్నారు. ఏఏ కేసులు మధ్యవర్తిత్వంలో పరిష్కరించుకోవచ్చో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి.శేషమ్మ వివరించారు. జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బెవర సత్యనారాయణ, కార్యదర్శి నరేష్, న్యాయవాదులు పాల్గొన్నారు.

SUNDAY SPECIAL

గల్లీ నుంచి ఢిల్లీ వరకు..
హాకీ జైత్రయాత్ర

హాకీ.. పేరుకు జాతీయ క్రీడే గానీ మన ప్రాంతంలో అంతగా ప్రాచుర్యం లేని ఆట. గ్రామీణ ప్రాంతాల్లో హాకీకి అసలు ఆదరణ ఉండదు. అలాంటిది నక్కపల్లి నుంచి ఎందరో జాతీయ స్థాయి క్రీడాకారులు తయారవుతున్నారు. అంతేకాదు అందులో పలువురు స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు కూడా సంపాదించారు. ఈ ఘనతకు హాకీనే ప్రాణంగా భావించే ఓ కోచ్ కారణం. ఉచితంగా ఆయన ఇస్తున్న శిక్షణ పలువురు మెరికలను అందిస్తోంది.



నక్కపల్లి క్రీడా మైదానంలో హాకీ ప్రాక్టీసు చేస్తున్న యువత

- జాతీయ స్థాయిలో రాణిస్తున్న నక్కపల్లి హాకీ క్లబ్ సభ్యులు
- పది మందితో ప్రారంభమై 200కు పెరిగిన క్రీడాకారుల సంఖ్య
- ఉచితంగా శిక్షణ అందిస్తున్న కోచ్ సూరిబాబు
- స్పోర్ట్స్ కోటాలో కాలేజీలో సీట్లు, ఉద్యోగాలు సాధిస్తున్న ఆటగాళ్లు

నక్కపల్లి: సుమారు 30 మంది విద్యార్థులకు వివిధ రాష్ట్రాల్లోని స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశం.. నలుగురు క్రీడాకారులు స్పోర్ట్స్ కోటాలో ఆర్మీకి ఎంపికైన ఘనత.. రెండు పర్యాయాలు రాష్ట్ర స్థాయి పోటీలకు ఆతిథ్యం.. ఇవి నక్కపల్లి హాకీ క్లబ్ సాధించిన విజయాల్లో కొన్ని మాత్రమే. ఈ క్రీడను ఈ ప్రాంతానికి పరిచయం చేసింది బలిరెడ్డి సూరిబాబు అనే పోలీసు ఉద్యోగి. పోలీస్ శాఖలో హాకీ కోచ్‌గా పని చేస్తూ యలమంచిలి నుంచి వందలాది మంది హాకీ క్రీడాకారులను తయారు చేసిన సూరిబాబు తన తల్లి స్వగ్రామమైన నక్కపల్లిలో కూడా హాకీని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో తన తల్లి బలిరెడ్డి సత్యవతి పేరున నక్కపల్లిలో బి.ఎస్. హాకీ క్లబ్‌ను 2017లో స్థాపించారు. పదిమందితో ప్రారంభమైన ఈ హాకీ క్లబ్‌లో ప్రస్తుతం 200 మంది క్రీడాకారులు చేరారు.

కోచ్ సూరిబాబు తన సొంత ఖర్చులతో క్రీడాకారులకు హాకీ ఆటకు సంబంధించిన అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం నక్కపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో తర్ఫీదు ఇస్తున్నారు. ఇక్కడ శిక్షణ పొందిన సుమారు 30 మంది విద్యార్థులు ఏపీ, తెలంగాణ, తమిళనాడు, మధ్యప్రదేశ్, కర్నాటక తదితర రాష్ట్రాల్లో స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశం సంపాదించారు. ఏపీ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గత ఏడాది, ఈ ఏడాది వరుసగా అండర్ 14, అండర్ 17 విభాగాల్లో ఇక్కడ రాష్ట్ర స్థాయి పోటీలు జరిగాయి. అలాగే గత నెలలో ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల ఎంపిక కోసం కూడా ఇక్కడ క్రీడలు నిర్వహించడం విశేషం.



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయిన నక్కపల్లి క్రీడాకారులు



నక్కపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో క్రీడాకారుల కోసం ఏర్పాటు చేసిన హాకీ కోర్టు

అన్ని వైపులా ప్రోత్సాహం

హాకీ క్లబ్ విజయాలకు ముగ్ధులైన పాయకరావుపేట పూర్వ ఎమ్మెల్యే గొల్ల బాబూరావు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పక్కన 2 ఎకరాల స్థలాన్ని క్రీడా మైదానం కోసం కేటాయించారు. హెటిరో కంపెనీ యాజమాన్యం వారు లక్షలాది రూపాయలు కేటాయించి ఇక్కడ హాకీ క్రీడా మైదానాన్ని తయారు చేశారు. సూరిబాబు ఒక పక్క ఉద్యోగం చేస్తూ తన సహచరుడు కొల్నాటి తాతాజీ సహకారంతో శిక్షణ ఇస్తున్నారు. ఐదేళ్ల వయసు నుంచి 18 వయసు కలిగిన బాలబాలికలు తర్ఫీదు పొందుతున్నారు.

- 2020 డిసెంబరులో ఢిల్లీలో శివాజీ స్టేడియంలో జరిగిన సెవెన్త్ ఆల్ ఇండియా అండర్ 17 హాకీ టోర్నమెంట్‌లో నక్కపల్లి హాకీ క్లబ్ చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. ఉత్తమ టీమ్‌గా అవార్డు సాధించారు.
- చిత్తూరు జిల్లాలో జరిగిన అండర్ 19 సబ్ జూనియర్ విభాగం పోటీల్లో ద్వితీయ స్థానం సంపాదించారు. కాకినాడలో జరిగిన సీఎం కప్ హాకీ రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనపరిచారు.
- తాజాగా వారం క్రితం జరిగిన రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో రాణించిన నక్కపల్లి హాకీ క్లబ్‌లో శిక్షణ పొందుతున్న పది మంది క్రీడాకారులు జాతీయ జట్టుకు ఎంపికయ్యారు. ఈనెల 8 నుంచి మధ్యప్రదేశ్ మాండి సోరిలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారు.

డిగ్రీలో ఫ్రీ సీటు



నేను ఇంటర్ సెకండియర్ చదువుతూ నక్కపల్లి హాకీ క్లబ్‌లో తర్ఫీదు పొందాను. జిల్లా, రాష్ట్ర, యూనివర్సిటీ స్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరఫున పాల్గొని సీనియర్ కేటగిరీ స్కూల్స్ పోటీల్లో విజేతగా నిలిచి చెన్నై ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలో స్పోర్ట్స్ కోటాలో డిగ్రీలో సీటు సంపాదించాను. హాకీ నేర్చుకోవడం వల్లే ఉచిత విద్య లభించింది.

–ముద్దా వాసంతి, క్రీడాకారిణి, నక్కపల్లి

అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని..



గ్రామీణ ప్రాంతానికి చెందిన నేను నక్కపల్లి హైస్కూల్లో చదువుతూ ఇక్కడ ఉచితంగా హాకీ నేర్చుకుంటున్నాను. అండర్ 14 విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనపరచడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాను. అంతర్జాతీయ పోటీల్లో కూడా రాణిస్తాననే నమ్మకం ఉంది.

–మనబాల దిలీప్‌కుమార్, మనబానవానిపాలెం

స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం



నక్కపల్లి హాకీ క్లబ్‌లో శిక్షణ పొందుతూ వివిధ ప్రాంతాల్లో జరిగిన పోటీల్లో ప్రతిభ కనపరిచాను. ఆర్మీ సెలక్షన్స్‌లో స్పోర్ట్స్ కోటాలో ఎంపికై ఉద్యోగం సాధించాను. ఇక్కడ శిక్షణ తీసుకోవడం వల్లే హాకీలో రాణించి ఉద్యోగస్తుడనయ్యాను.

–అల్లాడ దుర్గాప్రసాద్, నక్కపల్లి

పాఠశాలల్లో ఆత్మీయ సమావేశాలు



విద్యార్థికి ప్రోగ్రెస్ కార్డు అందిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు



సబ్బవరంలో మాదకద్రవ్యాల జోలికి పోబోమని ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఐజీ గోపీనాథ్ జెట్టి



ఎస్.రాయవరంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అనిత, వేదికపై కలెక్టర్ విజయ కృష్ణన్

- కోటలు దాటిన నేతల మాటలు
- విస్తుపోయిన విద్యార్థుల తల్లిదండ్రులు

నాతవరం/ఎస్.రాయవరం/సబ్బవరం: జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం తల్లిదండ్రులు– ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులను ఆహ్వానించి, పాఠశాలలను అందంగా అలంకరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి పార్టీలకు చెందిన చోటామోటా నాయకులు సమావేశాల్లో ప్రసంగించారు. కోటలు దాటుతున్న వారి మాటలు విని.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అభివృద్ధి చేసిన పాఠశాలల్లో నిలబడి పెద్ద కబుర్లు చెబుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు విస్తుపోవడం కనిపించింది. స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు నాతవరం మండలంలోని డి.యర్రవరం హైస్కూల్లో నిర్వహించిన సమావేశానికి హాజరయ్యారు. పట్టణ ప్రాంతాల కంటే గ్రామీణ ప్రాంతాల్లో బాగా చదివే తెలివైన పిల్లలు ఉన్నారన్నారు. కార్పొరేట్ స్కూళ్లలో జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధిస్తున్న వారంతా పల్లెటూరు పిల్లలేనన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల తీరుతెన్నులను నిత్యం పరిశీలించాలన్నారు. ఆర్డీవో వి.వి.రమణ, మండల ప్రత్యేకాధికారి నాగ శిరీష, తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో ఉషాశ్రీ, సర్పంచ్ ఇనపసప్పల నూకరత్నం, ఎంపీటీసీ ఇనపసప్పల పుష్ప, ఎంఈవోలు సత్యనారాయణ, వరహాలబాబు, హైస్కూల్ హెచ్ఎం ఆకుల కుమారి పాల్గొన్నారు. రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ఎస్.రాయవరం జెడ్పీ హైస్కూల్లో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు , తల్లిదండ్రులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి సమావేశాన్ని నిర్వహించడం మంచి పరిణామమన్నారు. విద్యార్థి దశలో పిల్లలు మాదకద్రవ్యాలకు బానిసలవుతున్నారని, దీన్ని అరికట్టేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కలెక్టర్ విజయ కృష్ణన్‌తో కలిసి ఆమె మధ్యాహ్న భోజనం చేశారు. డీఈవో అప్పారావు నాయుడు, తహసీల్దార్ రమేష్ పాల్గొన్నారు. కలెక్టర్, డీఈవో పరవాడ మండలం తానాం గ్రామంలో మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలికల విద్యాలయం, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో జరిగిన కార్యక్రమాల్లో కూడా పాల్గొన్నారు. విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి సబ్బవరం గురుకుల పాఠశాలలో శనివారం నిర్వహించిన తల్లిదండ్రులు– ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. సైబర్ నేరాలు, డ్రగ్స్‌కు సంబంధించిన పోస్టర్‌ను విద్యార్థులతో కలిసి ప్రదర్శించారు.



కశింకోట బాలికల హైస్కూల్‌లో థింసా నృత్యం చేస్తున్న విద్యార్థినులు

మధ్యాహ్న భోజనం బాగులేదు

మాడుగుల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో మధ్యాహ్న భోజనం బాగుండలేదని కొంతమంది తల్లిదండ్రులు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి దృష్టికి తీసుకువచ్చారు. ప్రస్తుతం విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం బాగులేదని, అక్కడ వడ్డిస్తున్న అన్నాన్ని తినలేకపోతున్నారని, నీరసంగా ఉంటున్నారని, మెరుగైన భోజనాలు అందించాలని లక్ష్మీదేవి అనే విద్యార్థి తల్లి కోరారు. స్పందించిన ఎమ్మెల్యే భోజనం తయారు చేసే క్రమంలో ఎక్కడ లోపం ఉందో తెలుసుకుని మెరుగైన పౌష్టికాహారం అందించాలని వంట నిర్వాహకులను ఆదేశించారు.



మాట్లాడుతున్న విద్యార్థి తల్లి లక్ష్మీదేవి

22న విశాఖ-బనారస్ రైలు రద్దు

తాటిచెట్లపాలెం (విశాఖ): రాంచీ డివిజన్, సోరంటోలి చౌక్ స్టేషన్ పరిధిలో ఆధునికీకరణ పనుల నేపథ్యంలో ఈ నెల 22వ తేదీన విశాఖపట్నం–బనారస్(18311) ఎక్స్‌ప్రెస్, తిరుగు ప్రయాణంలో 23వ తేదీన బనారస్– విశాఖపట్నం(18312) ఎక్స్‌ప్రెస్‌లు రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. ప్రయాణికులు మార్పులను గమనించాలని రైల్వే అధికారులు సూచించారు.

వెండి వాకిలిలో ఆండాల్ అమ్మవారు

సింహాచలం: సింహగిరిపై శ్రీవరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో కొలువుదీరిన ఆండాల్ అమ్మవారి సన్నిధి ఇక నుంచి వెండి వాకిలితో దర్శనమివ్వనుంది. నగరంలోని పెదముషిడివాడకు చెందిన తిరుమల స్టీల్ ఎంటర్ ప్రైజస్ అధినేత గ్రంధి రాంజీ దంపతులు 28 కిలోల వెండి వాకిలిని అమ్మవారి సన్నిధికి తయారు చేయించి సింహాచలం దేవస్థానానికి బహూకరించారు. ఆలయానికి కుటుంబ సమేతంగా వచ్చిన దాత వెండివాకిలిని దేవస్థానం ఈవో వి.త్రినాథరావుకు అందజేశారు. దాతకు స్వామివారి దర్శనాన్ని కల్పించి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని ఈవో అందజేశారు. దేవస్థానం మాజీ ట్రస్ట్‌బోర్డు సభ్యురాలు వంకాయల విజయనిర్మల, డిప్యూటీ ఈవో రాధ, ఈఈ శ్రీనివాసరాజు, దేవదాయశాఖ జ్యూయలరీ వెరిఫికేషన్ అధికారి పల్లంరాజు పాల్గొన్నారు.



దేవస్థానం ఈవోకు వెండి వాకిలిని అందజేస్తున్న దాత గ్రంధి రాంజీ దంపతులు

క్లుప్తంగా

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



విద్యార్థులతో కలిసి బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: ఎస్పీ తుహిన్ సిన్హా మెయిన్‌రోడ్డు పెద్ద హైస్కూల్ ఆవరణలో శనివారం విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, సమస్యలను వివరించారు. డ్రగ్స్ వ్యతిరేక ప్రచార బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

ఆటో డ్రైవర్‌పై కత్తితో దాడి

- చేతులు, కాళ్ల వేళ్లను కోసిన ఆగంతకుడు



ఎన్టీఆర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గోవిందు

అనకాపల్లి: తుమ్మపాల పంచాయతీ ప్రమీలా నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ ఎ.గోవిందుపై గుర్తు తెలియని వ్యక్తి చాకుతో దాడి చేశాడు. అనకాపల్లి–చోడవరం రహదారిపై ఆటో వెళుతుండగా సాధారణ ప్రయాణికుడిలా ఆటో ఎక్కిన ఆగంతకుడు.. చోడవరం బస్టాప్ సమీపంలోని ఆటోస్టాండ్ వద్ద శనివారం రాత్రి చాకుతో చేతులు, కాళ్ల వేళ్లను కోసి అక్కడ నుంచి పరారయ్యాడు. స్థానికులుగోవిందును హుటాహుటిన స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. పట్టణ సీఐ టి.వి.విజయకుమార్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలను సేకరిస్తున్నారు.

‘ఊరు’కుంటే ఇష్టారాజ్యం..



రోడ్డుకు తీర్మానం చేసిన ప్రాంతాన్ని చూపుతున్న ఉప సర్పంచ్ రామకృష్ణ



వివాదానికి కారణమైన నూతనంగా వేసిన సీసీ రోడ్డు

- రోడ్డు మంజూరు ఒక చోట.. వేసింది మరో చోట
- పంచాయతీ పాలకవర్గం నిర్ణయం బేఖాతర్
- అధికార పార్టీ సర్పంచ్ భర్త నిర్వాకం
- జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ఉప సర్పంచ్

చీడికాడ : పార్టీ అధికారంలో ఉందని తాను ఏం చేస్తే అది జరిగి తీరాల్సిందన్నట్లుగా మండలంలోని మంచాల సర్పంచ్ కసిరెడ్డి భాగ్యలక్ష్మి, ఆమె భర్త శ్రీరామమూర్తి వ్యవహార శైలి ఉందని ఉప సర్పంచ్ కసిరెడ్డి రామకృష్ణ ఆరోపించారు. ఆయన శనివారం అందించిన వివరాలిలా ఉన్నాయి. గ్రామంలో సీసీ రోడ్లు వేసేందుకు సహకరించాలని సర్పంచ్ భర్త కోరడంతో జూలై 2వ తేదీన పాలక వర్గ సమావేశం నిర్వహించామన్నారు. పంచాయతీలో 8వార్డులు ఉండగా సర్పంచ్ తరఫున 1 వార్డు సభ్యుడు (టీడీపీ సానుభూతిపరుడు), ఉప సర్పంచ్ తరఫున ఏడుగురు వార్డు సభ్యులు (వైఎస్సార్‌సీపీ మద్దతుదార్లు)ఉన్నారు. పంచాయతీ తీర్మానం ఆమోదించాలంటే తప్పనిసరిగా వైఎస్సార్‌సీపీ మద్దతు అవసరం ఉందన్నారు. ఊరు బాగుకోసం కొన్ని రోడ్లను ఆమోదించామని, అయితే తాము పంచాయతీ కార్యాలయం నుంచి కురందాసు చిన ముసిలినాయుడు ఇంటి వరకు సీసీ రోడ్డు వేయాలని ఆమోదించి తీర్మానం ఇచ్చామన్నారు. కానీ తాము తీర్మానించిన రోడ్డును విడిచిపెట్టి తీర్మానంలో వ్యతిరేకించిన మాడిస కొండలరావు ఇంటి వద్ద నుంచి రోడ్డు వేశారని తెలిపారు. ఇదేమిటని ప్రశ్నిస్తే నాకు నచ్చిన చోటే వేస్తానని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పి రోడ్డు నిర్మాణం కొనసాగించారన్నారు. దీనిపై మండల ఇంజినీర్ పరదేశినాయుడుతో పాటు కలెక్టర్‌కు పిర్యాదు చేశామని తెలిపారు. చిన్నపాటి చినుకు పడితే ఇబ్బందులు పడుతున్న ఇళ్ల మధ్య రోడ్డును విడిచి ఇళ్లే లేని ప్రాంతంలో రోడ్డు వేశారన్నారు. అధికారపార్టీ నేత కావడంతో అధికారులు కూడా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పది మందికీ ఉపయోగపడే రోడ్డును పూర్తి చేయాలని రామకృష్ణతో పాటు వార్డు సభ్యుడు కురందాసు అశోక్ కోరారు.

ఆ రోడ్లన్నీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేసినవే



స్పీకర్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఫొటోను చూపుతున్న మాజీ ఎమ్మెల్యే గణేష్

- మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: నియోజకవర్గంలో తాజాగా మొదలైన రోడ్ల అభివృద్ధి పనులన్నీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో మంజూరు చేసినవేనని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అప్పుడు మంజూరు చేసిన పనులకే ఇప్పుడు స్పీకర్ సీహెచ్.అయ్యన్నపాత్రుడు కొబ్బరి కాయలు కొట్టి శిలాఫలకాలను ఆవిష్కరిస్తున్నారని చెప్పారు. ఎంతసేపు కృష్ణదేవిపేట రోడ్డుకు తానే నిధులు మంజూరు చేయించానని చెప్పుకునే అయ్యన్నపాత్రుడు ప్రస్తుతం జరుగుతున్న రోడ్ల అభివృద్ధి పనులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలోనేవని ఒప్పుకుంటారా అని ప్రశ్నించారు. శృంగవరం నుంచి కాకినాడ జిల్లా సరిహద్దు వరకు 4.3 కిలో మీటర్ల రోడ్డు అభివృద్ధికి రూ.14.42 కోట్లు మంజూరు చేస్తూ తమ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ప్రస్తుతం కళ్యాణదుర్గం టీడీపీ ఎమ్మెల్యే ఎ.సురేంద్ర బాబుకు చెందిన ఎస్ఆర్‌సీ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ పనులు ప్రారంభించి మధ్యలో వదిలేసిందని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మంచి పేరు రాకూడదనే ఉద్దేశంతో ఆ కంపెనీ పనులను అర్ధాంతరంగా నిలిపివేసిందన్నారు. ఈ పనులకే ఇటీవల మన్యపురట్ల సెంటర్లో స్పీకర్ కొబ్బరి కాయ కొట్టి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారని చెప్పారు. ఈ రోడ్డు నిర్మాణంతో పాటు సుందరకోట నుంచి అసన్నగిరి, కరక నుంచి డొంకాడ, పీఎస్‌డీపాలెం–పప్పుశెట్టిపాలెం, ఏరియా ఆస్పత్రి–డిగ్రీ కళాశాల, గిడుతూ–సుంకపూరు ప్రాంతాల్లో 19.05 కిలో మీటర్ల రోడ్ల అభివృద్ధికి తమ ప్రభుత్వం రూ. 26.79 కోట్లు మంజూరు చేసిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంజూరు చేసిన పనులను తాను మంజూరు చేశానని స్పీకర్ గొప్పగా చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. పనులు అన్నింటికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే టెండర్ ప్రక్రియ పూర్తయిందన్నారు. 2019 సంవత్సరానికి ముందు టీడీపీ ప్రభుత్వం కాలంలో నర్సీపట్నం నుంచి కృష్ణదేవి పేటకు 23.01 కిలో మీటర్ల రోడ్ల అభివృద్ధికి రూ.25 కోట్లు మంజూరు చేసినా, పనులను మాత్రం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పూర్తి చేశామన్నారు. ఇప్పుడు అభివృద్ధి పనులు మీరే చేస్తున్నారు అనుకుంటే గతంలో కేడీపేట రోడ్డు నిర్మాణం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసినట్టుగా అంగీకరించాలి, లేదా మంజూరు చేయించటం ముఖ్యం అనుకుంటే ఇప్పుడు చేస్తున్న అభివృద్ధి పనులు వైఎస్సార్‌సీపీ చేసిందనీ అంగీకరించాలని స్పీకర్‌ను మాజీ ఎమ్మెల్యే డిమాండ్ చేశారు.

ఇసుక దోపిడీపై అధికారులు కోర్టు మెట్లు ఎక్కక తప్పదు

గబ్బాడ యార్డులో ఇసుక దోపిడీపై అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారని విమర్శించారు. ఇసుక అక్రమ రవాణా వెనక ఎవరి ప్రమేయం ఉందో స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి 40 రోజులు కావస్తున్నా ఎటువంటి చర్యలు తీసుకోలేదని చెప్పారు. అధికారులు నోరు మెదపకపోవడంతో హైకోర్టును ఆశ్రయించామని, రెండు, మూడు రోజుల్లో అధికారులకు నోటీసులు వస్తాయన్నారు. అధికారులు కోర్టు మెట్లు ఎక్కక తప్పదని హెచ్చరించారు. ఇప్పటికైనా అధికారులు దోషులను పట్టుకుని వారి వెనక ఎవరున్నారో నిగ్గుతేల్చాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్‌ఛైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, పార్టీ పట్టణ అధ్యక్షులు ఏకా శివ, లీగల్ సెల్ విభాగం ప్రతినిధి మాకిరెడ్డి బుల్లిదొర, తమరాన శ్రీను పాల్గొన్నారు.

పకడ్బందీగా పంట కోత ప్రయోగాలు

- జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి మోహన్‌రావు

దేవరాపల్లి: పంట కోత ప్రయోగాలను క్షేత్ర స్థాయిలో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి బి.మోహన్‌రావు వ్యవసాయశాఖ సిబ్బందికి సూచించారు. మండలంలోని కాశీపురంలో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా అమర–1064 రకం వరి చేనులో పంట కోత ప్రయోగాన్ని చేపట్టి, వచ్చిన దిగుబడిని పరిశీలించారు. పంట కోత ప్రయోగాలను కచ్చితంగా చేపట్టాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఆయన స్థానిక రైతులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ రెండో పంటగా మినుములు, పెసర సాగు చేసే రైతులు ప్రధానమంత్రి పసల్ బీమా యోజనను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ పథకంలో ఎకరానికి రూ.300 చొప్పున మీసేవా కేంద్రాల్లో చెల్లించి బీమా చేయించుకోవాలన్నారు. బీమా కోసం భూమి వన్‌బి, ఆధార్‌కార్డు, బ్యాంక్ బుక్ జెరాక్స్‌తో పాటు ఆధార్ లింకైన ఫోన్ నంబర్‌ను తీసుకుని వెళ్లాలన్నారు. మండల వ్యవసాయ అధికారి వై.కాంతమ్మ, మండల విస్తర్ణ అధికారి ఎస్.కిరణ్‌కుమార్, ఉద్యానవన శాఖ అధికారి కిరణ్మయి, అగ్రికల్చర్ అసిస్టెంట్లు బి.రామానాయుడు, కె.సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా చిన్నారుల స్విమ్మింగ్ పోటీలు

విశాఖ స్పోర్ట్స్: ఏపీ అంతర్ జిల్లాల సబ్ జూనియర్, జూనియర్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ శనివారం సాగర తీరంలోని ఆక్వాస్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రారంభమైంది. జిల్లా స్విమ్మింగ్ సంఘం ఆధ్వర్యంలో మూడు ఏజ్ గ్రూప్‌ల్లో ఫ్రీస్టయిల్, బాక్ స్ట్రోక్, బ్రెస్ట్ స్ట్రోక్, బటర్ ఫ్లై, వ్యక్తిగత మెడ్లే అంశాల్లో బాల బాలికలకు పోటీలు నిర్వహిస్తున్నారు. వాటర్ పోలోతో సహా మొత్తంగా 45 అంశాల్లో పోటీలు నిర్వహించి.. సాధించిన రికార్డుల ఆధారంగా రాష్ట్ర జట్లను ఎంపిక చేస్తామని సంఘ కార్యదర్శి మోహన్‌రామ్ తెలిపారు. ముందుగా ఈ పోటీలను విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే పి.జి.వి.ఆర్ నాయుడు ప్రారంభించారు. అనంతరం పోటీలు నిర్వహించి విజేతలను ప్రకటించారు.

నగలు కాజేసి మహిళకు బెదిరింపులు

- యువకుడిపై పోలీసుల కేసు నమోదు

రాంబిల్లి (యలమంచిలి) : గతంలో తన వద్ద తీసుకున్న బంగారు ఆభరణాలు తిరిగి ఇవ్వమని కోరిన మహిళకు సంబంధించిన ప్రైవేట్ వీడియోలు సామాజిక మాధ్యమాల్లో పెడతానని బెదిరించిన యువకుడిపై రాంబిల్లి పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. రాంబిల్లి సీఐ సీహెచ్. నర్సింగరావు మీడియాకు తెలిపిన వివరాలివి. రాంబిల్లి మండలం ఆర్.నర్సాపురం గ్రామానికి చెందిన ఓ మహిళకు, రాజకోడూరు గ్రామానికి చెందిన రావి బాబూజీతో సాన్నిహిత్యం ఉండేది. ఈ నేపథ్యంలో రెండేళ్ల కిందట బాబూజీ తన భార్య పుష్పలతతో కలసి ఆ మహిళ ఇంటికి వెళ్లాడు. ఫంక్షన్‌కి వెళ్లాల్సి ఉందని మూడు తులాల హారం, రెండు తులాల నక్లెస్ ఒకసారి ఇవ్వాలని, ఫంక్షన్‌కి వెళ్లి తిరిగి రెండు రోజుల్లో ఇచ్చేస్తానని నమ్మబలికాడు. కానీ చెప్పినట్టుగా నగలు తిరిగి ఇవ్వలేదు. నగల కోసం బాబూజీని అడిగితే శారీరకంగా తన కోరిక తీర్చితే ఆభరణాలు ఇచ్చేస్తానని చెప్పడంతో బాధితురాలు గత్యంతరం లేక అందుకు అంగీకరించింది. ఆ తర్వాత కూడా ఆభరణాలు ఇవ్వకపోవడంతో బాధితురాలు గట్టిగా నిలదీసింది. తనను నగల కోసం ఒత్తిడి చేస్తే తనతో ఆమె ఏకాంతంగా కలిసిన సమయంలో రహస్యంగా తీసిన వీడియోలు, ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేస్తానని బెదిరించాడు. దీంతో బాధితురాలు రాంబిల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు నిందితుడుపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

మురుగన్ కల్యాణం... మురిసిన జనం



వల్లీదేవన సేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణ మూర్తులు



స్వామివారి తిరువీధి ఉత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజు, భక్తులు



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

- కనుల పండువగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణమహోత్సవం
- భారీగా పాల్గొన్న భక్తులు

చోడవరం: స్థానిక స్వయంభూ గౌరీశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో గల ఉపాలయంలో వేంచేసియున్న సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. సుబ్రహ్మణ్యషష్టిని పురస్కరించుకుని స్వామి కల్యాణం జరిపారు. వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల మధ్య ఆలయ అర్చకులు కొడమంచిలి చలపతి పర్యవేక్షణలో వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామివారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాన్ని కనులారా తిలకించిన భక్తులు పరవశించిపోయారు. కుమారస్వామి నామస్మరణతో ఈ ప్రాంతం మార్మోగింది. ఈ సందర్భంగా నిర్వహించిన అన్నసమారాధనలో వందలాది మంది పాల్గొన్నారు. అనంతరం సాయంత్రం ప్రత్యేక వాహనంపై స్వామివారి తిరువీధి ఉత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్. రాజు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

60 కిలోల గంజాయి స్వాధీనం



కశింకోట పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి, పట్టుబడిన నిందితులు



గంజాయితో పట్టుబడిన నిందితులతో ఎస్ఐ లక్ష్మీనారాయణ

కశింకోట: మండలంలోని అచ్చెర్ల కూడలి వద్ద ఏజెన్సీ ప్రాంతం నుంచి చెన్నైకు తరలిస్తున్న 60 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకుని, ఎనిమిది మందిని అరెస్టు చేశారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. గంజాయితో పాటు వ్యాన్, రెండు మోటారు సైకిళ్లు, 8 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. సీఐ అల్లు స్వామినాయుడు అందించిన వివరాల ప్రకారం.. గంజాయి తరలిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు అచ్చెర్ల కూడలి వద్ద ఎస్ఐ కె.లక్ష్మణరావు, సిబ్బంది వాహనాలను తనిఖీ చేశారు. ఆ సమయంలో వచ్చిన వ్యాన్‌లో 60 కిలోల గంజాయి పట్టుబడింది. వ్యాన్‌కు ముందు పైలెట్‌గా వచ్చిన వారిని కూడా పట్టుకున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన గిమ్మెలి సుబ్బారావు, కొర్రా చంద్రబాబు, గెమ్మెలి రవి, తమిళనాడుకు చెందిన పి.రాజా, మగేష్, మరాసు సందీప్, సెల్వం శేఖర్, మోహన్‌లను అరెస్టు చేశారు. తమిళనాడుకు చెందిన సేతురాం గంజాయిని జి.మాడుగుల మండలానికి చెందిన చిక్కుడు కొండబాబు అలియాస్ అర్జున్ అలియాస్ వెంకటరావు వద్ద కొనుగోలు చేశాడు. వారిద్దరు పరారీలో ఉన్నారని సీఐ స్వామినాయుడు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

ఆనందపురం కూడలిలో ముగ్గురి అరెస్టు

కె.కోటపాడు: మండలంలోని ఆనందపురం కూడలి వద్ద గంజాయిని తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను ఎ.కోడూరు ఎస్ఐ లక్ష్మీనారాయణ శనివారం పట్టుకున్నారు. సిబ్బందితో కలసి వాహనాలు తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఆనందపురం కూడలి వద్ద ముగ్గురు వ్యక్తులు బ్యాగులతో అనుమానాస్పదంగా సంచరించడాన్ని గుర్తించారు. వారిని పట్టుకుని బ్యాగులను తనిఖీ చేయగా పది కిలోల గంజాయి బయటపడింది. పాడేరుకు చెందిన వి.అప్పన్న, తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఎస్.విఘ్నేష్, వి.ధనుష్‌పై కేసు నమోదు చేసి, రిమాండుకు తరలించినట్టు ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. వారి వద్ద నుంచి మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు ఆయన తెలిపారు. పట్టుకున్న గంజాయి విలువ రూ.50 వేలు ఉంటుందని ఎస్ఐ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



సాయిగీత మృతదేహం



సాయిగీత (ఫైల్)

కశింకోట: తండ్రిని చూసేందుకు వెళ్తూ మండలంలోని నరసింగబిల్లి వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందారు. విశాఖ నుంచి యలమంచిలి వైపు వెళుతున్న స్కూటీ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని కింద పడింది. దీంతో స్కూటీ నడుపుతున్న విశాఖలో ఓ హార్డ్ వేర్ దుకాణంలో పనిచేస్తున్న ఇనుపకుర్తి సాయిగీత(35) తీవ్రంగా గాయపడింది. ఆమెను హైవే అంబులెన్స్‌లో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. యలమంచిలిలో ఉన్న తన తండ్రి వెంకటరమణను చూసేందుకు వెళుతూప్రమాదానికి గురైంది. ఆమె భర్త ఏడాది కిందట మరణించాడు. వీరి ఒక కుమార్తె ఉంది. తల్లి మృతితో ఆమె అనాథ అయింది. సీఐ అల్లు స్వామినాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వెయ్యి లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం



ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్న బెల్లం పులుపు డ్రమ్ము

బుచ్చెయ్యపేట: మండలంలోని గున్నెంపూడిలో చోడవరం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి, వెయ్యి లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశారు. స్థానికుల సమాచారం మేరకు శనివారం గున్నెంపూడి గ్రామ శివారులో దాడులు జరిపారు. గ్రామానికి కిలోమీటరు దూరంలో కొండల వద్ద సారా తయారీకి సిద్ధం చేసిన ఐదు డ్రమ్ముల్లో బెల్లం పులుపును పోలీసులు గుర్తించారు. పోలీసులను చూసిన ఓ వ్యక్తి పారిపోగా, పట్టుకున్న ఐదు డ్రమ్ముల్లో ఉన్న బెల్లం పులుపును పోలీసులు పారబోసి, డ్రమ్ములను కాల్చివేశారు. సారా బట్టీలను ధ్వంసం చేశారు.

క్లుప్తంగా

ధ్యాన వెంకన్నకు పూజలు


అలంకరణలో ధ్యాన వేంకటేశ్వర స్వామి

కశింకోట: కశింకోట ధ్యాన వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. వజ్ర కవచం, పూల మాలలు, తులసీ మాలలతో స్వామి మూల విరాట్‌ను అలంకరించి విష్ణు సహస్ర నామార్చన చేశారు. రాత్రి నక్షత్ర హారతి సమర్పించారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

21న గౌరీపరమేశ్వరుల ఉత్సవం


కుంచావారి గౌరీపరమేశ్వరులు

అనకాపల్లి: స్థానిక మెయిన్ రోడ్డు పెరుగుబజార్ జంక్షన్ వద్ద కుంచావారి గౌరీపరమేశ్వరుల ఉత్సవాన్ని ఈ నెల 21న నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ అబ్బులు తెలిపారు. వేకువజాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, మధ్యాహ్నం పట్టణంలోని పుర వీధుల్లో శనివారం నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు ఊరేగింపు కార్యక్రమం ఉంటుందన్నారు. 21న నేలవేషాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, స్టేజ్ ప్రోగ్రాంలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అమ్మవారి ఉత్సవానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు.

పాఠశాలకు రూ.10 వేల సాయం

సబ్బవరం:మండలంలోని ఆరిపాక శివారు చినయాతపాలెంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణంలోని సరస్వతీ దేవి విగ్రహానికి షెడ్ నిర్మాణానికి వైఎస్సార్ పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షులు పాలిశెట్టి సురేష్ రాజ్ రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ పీలా వరలక్ష్మి, తుమ్మపాల సుగర్స్ మాజీ డైరెక్టర్ మళ్ల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శనివారం 2,482 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,900	4,450
మొదటి రకం	3,540	4.300
రెండో రకం	3,100	3,790
మూడోరకం	2,930	3,090

అనకాపల్లి సినిమాలు

పుష్ప-2	: రాజా
పుష్ప-2	: సత్యనారాయణ స్క్రీన్-1
పుష్ప-2	: సత్యనారాయణ స్క్రీన్-2
పుష్ప-2	: పర్తిసాయి
పుష్ప-2	: షిర్డీసాయి
పుష్ప-2	: వెంకటేశ్వర
సినిమా పిచ్చోడు	: శ్రీసత్య
పుష్ప-2	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 46 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-7, బీ పాజిటివ్-10, ఓ పాజిటివ్-28, ఏబీ పాజిటివ్-1 యూనిట్ చొప్పున శుద్ధి చేసిన రక్తం అందుబాటులో ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్‌ను 97036 19706 నంబర్‌లో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 339 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 305 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 నంబర్‌లో సంప్రదించవచ్చు.

అన్నదాతకు అందని సాయం

- కోత దశకు వచ్చినా.. అందని పెట్టుబడి నగదు
- రూ.14 వేలు అందిస్తామన్న కూటమి ప్రభుత్వం
- అప్పులు చేసి సాగు చేసిన రైతులు
- సాయం కోసం నేటికీ తప్పని నిరీక్షణ

మండలంలో రైతులు : 11 వేలు
వరి సాగు : 6,300 ఎకరాలు
కేంద్రం అందించిన సాయం : రూ.4 వేలు
కూటమి ప్రభుత్వ సాయం : నేటికీ అందలేదు


తుమ్మపాల గ్రామంలో కోసిన వరిపనలు

అనకాపల్లి: పెట్టుబడి సాయం సమయానికి అందకపోవడంతో రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు. వైఎస్సార్‌సీపీ పాలనలో రైతుల పెట్టుబడి కోసం ముందుగానే వారి బ్యాంక్ ఖాతాల్లో నగదును జమ చేయడంతో వారికి ఎంతో చేయూత లభించేది. అయితే, సార్వత్రిక ఎన్నికల సమయంలో అన్నదాత సుఖీభవ పథకం కింద ఏటా రైతులకు పెట్టుబడిగా కేంద్రప్రభుత్వ సాయంతో కలిపి రూ.20 వేలు అందిస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చాక నేటి వరకూ పథకాన్ని అమలు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పైగా అదనంగా పంటల బీమా ప్రీమియం భారాన్ని కూడా రైతులపైనే మోపడంతో వారు లబోదిబోమంటున్నారు.

వైఎస్సార్‌సీపీ పాలనలో...

వైఎస్సార్‌సీపీ పాలనలో రైతుల తరఫున ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించి, వారిని ఆదుకుంది. పంట సాగుచేసే ప్రతి రైతుకు పెట్టుబడి సాయం కింద ఏటా రూ.13,500 నగదును వారి బ్యాంక్ ఖాతాలకు క్రమం తప్పకుండా జమచేస్తూ వచ్చింది. కూటమి ప్రభుత్వంలో అధికారం చేపట్టి ఐదు నెలలు అవుతున్నా రైతుల బ్యాంక్ ఖాతాలో ఒక్క రూపాయి కూడా జమ చేయలేదు. దీంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో సుమారు 11వేలమంది రైతులు ఉన్నారు. ఈ ఏడాది 6,300 ఎకరాల్లో వరి పంట వేశారు. రైతులు ప్రతీ ఏడాది జూలైలో వరి పంట వేస్తారు. వారు పెట్టుబడి పెట్టే సమయంలో అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేసి ఉంటే అప్పులబాధ తప్పేది. ప్రస్తుతం వరి పంట కోతకు వచ్చినా కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేదు.

- గత ప్రభుత్వంలో రైతుకు ఏడాదికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.7500, కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.6వేలు కలిపి రూ.13,500 నగదును రైతు బ్యాంక్ ఖాతాలో పంట వేసుకునే సమయంలో అందించేవారు.
- కూటమి ప్రభుత్వం అన్నదాన సుఖీభవ పథకం ద్వారా ఏడాదికి రూ.14వేలు అందజేస్తామని, కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే రూ.6వేలతో కలిపి మొత్తం రూ.20వేలు అందజేస్తామని చెప్పడంతో రైతులు ఎంతో ఆనందించారు. కేంద్ర ప్రభుత్వం రెండు దఫాల్లో జూలై, అక్టోబర్ మాసాల్లో రూ.4వేలు రైతుల బ్యాంక్ ఖాతాలో జమ చేసింది. మరో దఫా ఇవ్వాల్సిన రూ.2 వేలు వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఇచ్చేందుకు సిద్ధం ఉన్నా.. కూటమి ప్రభుత్వం ఇస్తామని చెప్పి రూ.14వేలలో నేటివరకూ ఒక్క రూపాయి కూడా రైతుల ఖాతాలో జమ చేయలేదు.
- రైతులు నవంబర్ మాసంలో వరి కోతలు చేపట్టాల్సి ఉన్నా తుఫాన్ కారణంగా అధికారుల ఆదేశాల మేరకు వాయిదా వేసుకున్నారు. వరికోతలు కోసుకునే సమయంలో అయినా అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.14వేలు ఇస్తే బాగుంటుందని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.


తగరంపూడి గ్రామంలో కోతకు వచ్చిన వరి

పెట్టుబడి సమయంలో సాయం అందలేదు



ఎకరం పొలంలో వరిపంట వేశాను. పంట కోత దశలో ఉంది. గత ప్రభుత్వ హయాంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే పెట్టుబడి సాయం అందింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నేటివరకూ అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయలేదు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.4వేలు బ్యాంక్ ఖాతాలో జమచేశారు. రెండు, మూడు రోజుల్లో వరికోత ప్రారంభిస్తాం. ఇప్పుడైనా నగదు జమ చేయాలి.
– కె.రాజు, రైతు, అనకాపల్లి

అప్పు చేసి పెట్టుబడి పెట్టా..



రెండు ఎకరాల్లో వరి పంట వేశాను. పెట్టుబడికి బ్యాంకులో అప్పు చేశాను. పంట వేశాక రెండు తుఫాన్లు రావడంతో చాలా భయపడ్డాను. కోత దశలోనూ తుఫాన్ వస్తుందనడంతో ఏం చేయాలో అర్థం కాలేదు. అదృష్టవశాత్తు మా ప్రాంతానికి పెద్దగా తుఫాన్ సమస్య లేకపోయింది. కోత సమయంలోనైనా పెట్టుబడి సాయం అందిస్తే అప్పు తీర్చగలను.
– పి.కల్యాణ్, రైతు, అక్కిరెడ్డిపాలెం, అనకాపల్లి మండలం

ఇంకా ఆదేశాలు రాలేదు

ఈ ఏడాది 6,300 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. అన్ని గ్రామాల్లో వరిపంట బాగా పండింది. అన్నదాత సుఖీభవ పథకంపై ప్రభుత్వం నుంచి మాకు ఇంకా ఎటువంటి ఆదేశాలు రాలేదు. వచ్చిన వెంటనే చర్యలు చేపడతాం.
– పి.రంగాచారి, మండల వ్యవసాయ శాఖ అధికారి

విద్యార్థుల ట్యాబ్‌లు తిరిగివ్వాలి

అనకాపల్లి: మామిడిపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8,9,10 తరగతుల విద్యార్థుల నుంచి హెచ్‌ఎం ట్యాబ్‌లు తీసుకోవడం అన్యాయమని సీపీఐ జోనల్ కార్యదర్శి వై.ఎస్.భద్రం, మండల కార్యదర్శి చెల్లూరు నాగరాజు పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో విద్యార్థుల భవిష్యత్తు కోసం అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారని తెలిపారు. వాటిని హైస్కూల్ ఉపాధ్యాయులు, హెచ్‌ఎం విద్యార్థుల నుంచి బలవంతంగా తీసుకోవడమేమిటని ప్రశ్నించారు. విద్యాశాఖ ఉన్నతాధికారుల నుంచి ఎటువంటి ఆదేశాలు లేకుండా, గత ప్రభుత్వంలో ఇచ్చిన ట్యాబ్‌లు పాఠశాలకు అప్పగించాలని.. లేనిపక్షంలో విద్యార్థులకు టీసీలు ఇచ్చేస్తామని బెదిరించడం అన్యాయమని పేర్కొన్నారు. ట్యాబ్‌లు విద్యార్థుల దగ్గర ఉంటే పాఠ్యాంశాలు నేర్చుకునే అవకాశం ఉందని, ఉపాధ్యాయులు బలవంతంగా లాక్కొని మూలన పడేస్తే విద్యార్థులకు నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ట్యాబ్‌లను విద్యార్థులకు తక్షణమే ఇవ్వాలని లేనిపక్షంలో పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమ్మ ఒడి, విద్యా దీవెన వంటి పథకాలు అమలు చేయకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారని తెలియజేశారు.

నేడు జంగమ కుటుంబాల ఆత్మీయ కలయిక

అనకాపల్లి: శంకరం పంచాయతీ బొజ్జన్న కొండ వద్ద ఆదివారం ఉదయం 10 గంటలకు అనకాపల్లి రెవెన్యూ డివిజన్ జంగమ సేవా సంఘం కుటుంబం ఆత్మీయ కలయిక జరుగుతుందని సంఘ ప్రచార కార్యదర్శి లోకనాథం రఘురామ్ శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. సంఘంలో మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్స్, పిల్లలకు, పెద్దలకు ఆటల పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు బహుమతులు అందజేస్తామని చెప్పారు.

పాఠశాలల్లో సందడి

- తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాలు
- సాంస్కృతిక ప్రదర్శనలు, విన్యాసాలు, ఆటపాటలతో ఆకట్టుకున్న విద్యార్థులు


బాలికలకు ప్రోగ్రెస్ కార్డులు అందిస్తున్న అదనపు కార్యదర్శి సునీల్ రాజ్‌కుమార్


కశింకోట బాలికల హైస్కూల్‌లో విద్యార్థినుల విన్యాసం


కశింకోట హైస్కూల్‌లో బాలికలు వేసిన చిత్రాలు


కశింకోట బాలికల హైస్కూల్‌లో సమావేశానికి హాజరైన తల్లిదండ్రులు, విద్యార్థులు


కశింకోట బాలికల హైస్కూల్‌లో విద్యార్థినులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ


డీపీఎన్ హైస్కూల్‌లో విద్యార్థికి ప్రోగ్రెస్ కార్డు అందిస్తున్న ఎమ్మెల్యే కొణతాల


తాళ్లపాలెం గురుకుల పాఠశాలలో టగ్ ఆఫ్ వార్ ఆడుతున్న విద్యార్థుల తండ్రులు


కూండ్రం పాఠశాలలో విద్యార్థులకు ప్రోగ్రెస్ రిపోర్టులు అందిస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు

కశింకోట: నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాలు సందడిగా నిర్వహించారు. కశింకోట బాలికల హైస్కూల్‌లో విద్యార్థినులు చేసిన విన్యాసాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఇక్కడి వసతి గృహంలో ఉంటూ ఇదే స్కూల్‌లో చదువుతున్న అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన బాలికలు అటవీ ప్రాంతానికి చెందిన థింసా నృత్యం, కోలాటాలు ప్రదర్శించి అలరించారు. డీపీఎన్ జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులు డ్యాన్స్‌లు, నాటికలు ప్రదర్శించి ఆహుతులను ఆకట్టుకున్నారు. ఈ రెండు స్కూళ్లలో అధిక మార్కులు సాధిస్తున్న బాలబాలికలకు వేర్వేరుగా ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ దుశ్శాలువాలు కప్పి సత్కరించారు. కత్తిసాము, వెయిట్ లిఫ్టింగ్, కుస్తీ, వివిధ ఆటల పోటీల్లో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపుతున్న విద్యార్థులు సత్కరించి అభినందించారు. విద్యార్థులు చిత్రలేఖనాలు, వృత్తి విద్యా కోర్సులు, క్రాఫ్ట్స్‌తో వివిధ ఆకృతులు రూపొందించి ప్రదర్శించారు.

విద్యార్థులకు విలువలతో కూడిన విద్య

ఆయా పాఠశాల్లో జరిగిన సభల్లో ఎమ్మెల్యే రామకృష్ణ మాట్లాడుతూ వివిధ రంగాల్లో విశేషంగా రాణిస్తున్న మహిళామణులను ఆదర్శంగా తీసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి బాలికలు కృషి చేయాలన్నారు. విద్యార్థుల బంగారు భవిష్యత్ కోసం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కశింకోటలో జూనియర్ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత శిఖరాలు అందుకోవాలని ఆకాంక్షించారు. సీఐ అల్లు స్వామినాయుడు మాట్లాడుతూ సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములై తమ వంతు సహకారం అందిస్తామన్నారు. ఎంఈవోలు జి.సురేష్‌కుమార్, కె.ఎస్.ఎన్.మూర్తి, హెచ్‌ఎంలు ఎంఎస్ స్వర్ణకుమారి, ఎం.వి.ఆర్.అప్పారావు, ఎంపీడీవో వి.వి.రవికుమార్, సర్పంచ్ మంత్రి జయరజని, విద్యా కమిటీ చైర్మన్ ఆళ్ల శ్రీనివాసరావు, తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు, టీడీపీ మండలాధ్యక్షుడు కాయల మురళీధర్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ సిదిరెడ్డి శ్రీనివాసరావు, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు వేగి గోపీకృష్ణ, పీడీలు పెంటకోట కమల, వి.ప్రభాకరరావు, కూటమి నాయకులు పెంటకోట రాము, పి.కల్యాణి, బొడ్డేడ సత్యసాయి బాలాజీ, వేగి రామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ అదనపు కార్యదర్శి పి.సునీల్‌రాజ్‌కుమార్ ఆకాంక్షించారు. తాళ్లపాలెంలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ బాలికల గురుకుల కళాశాలలో నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలను బాగా చదివించి చదువును వారికి ఆస్తిగా ఇవ్వాలన్నారు. ఉపాధ్యాయులతో నిరంతరం మాట్లాడుతూ తమ పిల్లల ప్రగతిని ఎప్పటికప్పుడు తల్లిదండ్రులు బాధ్యతగా తెలుసుకోవాలన్నారు. గురుకుల విద్యాలయాల సంస్థ ఉమ్మడి విశాఖ జిల్లా సమన్వయ అధికారి ఎస్.రూపవతి మాట్లాడుతూ అటల్ టింకరింగ్ ల్యాబరేటరీ నిర్వహణలో తాళ్లపాలెం గురుకుల పాఠశాల ప్రథమ స్థానంలో ఉందన్నారు. ప్రిన్సిపాల్ జి.గ్రేస్ మాట్లాడుతూ తమ ఉపాధ్యాయ సిబ్బంది నిరంతరం విద్యార్థుల సంక్షేమం, విద్యాభివృద్ధికి శ్రమిస్తున్నారన్నారు. విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులను పంపిణీ చేసి ప్రతిభావంతులైన విద్యార్థులను అభినందించారు. తల్లిదండ్రులకు ముగ్గులు, తాడు లేగా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈవోపీఆర్, ప్రత్యేక అధికారి ఎం.వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు లగిశెట్టి భవాని, టీడీపీ మండలాధ్యక్షుడు కాయల మురళీధర్, జనసేన నాయకుడు కర్రి సత్యనారాయణ, అప్పారాష్ట్ర అధ్యక్షుడు, పూర్వ విద్యార్థి ఎం.వి.రమణ, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ సిహెచ్.రాజు, సభ్యులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

జగన్ హయాంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి

తుమ్మపాల: ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా గత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీర్చిదిద్దారని, వాటి ఫలాలు భవిష్యత్తులో విద్యార్థులకు పొందుతారని ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. మండలంలో కూండ్రం, కొండుపాలెం జిల్లా పరిషత్ పాఠశాలల్లో నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాల్లో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందించారు. విద్యార్థుల ఆటపాటలను తిలకించి అభినందించారు. ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. మండలంలో అన్ని గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తల్లిదండ్రుల కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సమావేశాలు ఘనంగా జరిగాయి. ఎంపీడీవో నరసింహారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల అనుపు మహోత్సవం


ఊరేగింపులో పాల్గొన్న కమిటీ సభ్యులు


అనుపు ఉత్సవంలో ఆకట్టుకున్న పులివేషాలు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం వినాయక గౌరీసేవా సమితి ఆధ్వర్యంలో పీలా వారి గౌరీపరమేశ్వరుల అనుపు మహోత్సవం శనివారం రాత్రి ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారిని పట్టణంలోని వీధుల్లో ఊరేగించారు. అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన నేలవేషాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఆలయ గౌరవాధ్యక్షుడు కొణతాల రఘునాథ్, శాశ్వత చైర్మన్ భీమరశెట్టి వరహా నూకరాజు, అధ్యక్షుడు భీమరశెట్టి శ్రీనివాసరావు, కార్యదర్శి బుద్ద బల్లమ్మ నాయుడు, కోశాధికారి భీమరశెట్టి లక్ష్మీనారాయణ, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్య స్వామి కల్యాణోత్సవం


సుబ్రహ్మణ్య స్వామి కల్యాణ ఘట్టాన్ని తిలకిస్తున్న భక్తులు

కశింకోట: కశింకోట కోనేరు వద్ద వెలసిన అయ్యప్ప స్వామి ఆలయంలో శనివారం షష్ఠి సందర్భంగా సుబ్రహ్మణ్య స్వామి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామికి ఉదయం నుంచి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. ఆలయ ప్రాంగణంలో సంప్రదాయబద్ధంగా వేదమంత్రాల నడుమ శ్రీవల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఉత్సవ విగ్రహాలకు కల్యాణాన్ని అర్చకుడు గోపాలకృష్ణ జరిపించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎస్.వి.ఎస్.ఎన్.శ్రీనురెడ్డి, కార్యదర్శి కె.రాజారావు, భక్తులు పాల్గొన్నారు.

- స్థానిక శివాలయంలో సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వి.చిదంబరం, వి.కృష్ణల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

నాలుగు ప్రాంతాల్లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు


డీ-1 సెక్షన్ పరిధిలో ఏర్పాటు చేస్తున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

అనకాపల్లి: పట్టణ పరిధిలో జనాభా పెరుగుదలకు అనుగుణంగా విద్యుత్ శాఖ డీ-1 సెక్షన్, ఉడ్‌పేట ఫీడర్, నర్సింగరావుపేట, ఉడ్‌పేటలోను, లక్ష్మీనారాయణనగర్ ఫీడర్ పరిధిలోని లక్ష్మీనారాయణనగర్, కోట్నివీధి ప్రాంతాల్లో కొత్తగా నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఏఈ త్రినాథ్ శనివారం తెలిపారు. ఈ ప్రాంతాల్లోని ప్రజలు లో ఓల్టేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని వచ్చిన ఫిర్యాదులు మేరకు వేసవిని దృష్టిలో పెట్టుకుని కొత్తగా పాయింట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ఫార్మాలో ప్రమాదంపై విచారణ జరపాలి

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీలో విజయశ్రీ ఆర్గానిక్స్ పరిశ్రమలో శుక్రవారం సాయంత్రం జరిగిన ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రొడక్షన్ బ్లాక్‌లో జరిగిన ప్రమాదంలో గాయపడిన ఇద్దరు కార్మికులకు మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. క్షతగాత్రులను పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి శ్రీనివాసరావు, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

పరవాడ: మండలంలో సోమవారం నుంచి ఈ నెల 31వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామని డిప్యూటీ తహసీల్దార్ సురేష్ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు రెవెన్యూ పరమైన సమస్యలను పరిష్కరించుకోవడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సదస్సులు వినియోగించుకోవాలని కోరారు.

మానవత్వం చాటుకున్న ఎన్టీపీసీ ఉద్యోగి


నిత్యావసర వస్తువులను అందజేస్తున్న ఎన్టీపీసీ ఉద్యోగి లక్ష్మి

పరవాడ: అచ్యుతాపురం మండలం పూడిమడక శివారు కడపాలెం గ్రామానికి చెందిన మైలపల్లి నూకాలమ్మకు చెందిన పూరిల్లు ఇటీవల అగ్ని ప్రమాదంలో కాలిపోయింది. దీంతో సర్వస్వం కోల్పోయి నిరాశ్రయురాలైన నూకాలమ్మకు సింహాద్రి ఎన్టీపీసీలో ఆర్‌ఎల్‌ఐ డిపార్ట్‌మెంట్‌లో సబ్ ఆఫీసర్ రుగడ లక్ష్మి సొంత నిధులతో నిత్యావసర సరకులు, రైస్ బ్యాగు, నూనె డబ్బా, పప్పులు, రూ.3 వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన మైలపల్లి లక్ష్మణ, గనగళ్ల రాజు పాల్గొన్నారు.